# అమ్మనై కరిగిపోతా !

"అమ్...మ్...మ్...మ్మా...!!!"

అనే మూలుగు హృదయవిదారకంగా... గొంతు మూలల నుంచి పైకెగిసి... పెదవుల అంచుల నుంచి జారి... ప్రసవవేదనగా ఆ గదిని ప్రతిధ్వనింపచేస్తోంది.

కనురెప్పల్ని భారంగా మూసి... పెదాల్ని బిగించి... పెల్లుబికి వస్తోన్న బాధనంతా మునిపంటితో నొక్కేసి... బెడ్‌పై అసహనంగా అటూ ఇటూ కదుల్తూ... పురిటి నొప్పుల్తో యాతన పడ్తున్నాను.

నా ఊపిరిలో ఊపిరై... నా అణువణువూ తనదై... నా రూపానికి ప్రతిరూపమై...

నాలో జీవం పోసుకుంటున్న ప్రాణి... నా రక్త మాంసాలు పంచుకొని... మరో మాంసపు ముద్దై రూపుదిద్దుకొని... నా పేగు తెంచుకొని... నా గర్భకోశం దాటి... ఈ పుడమి పైకి అడుగిడబోతున్న వేళది...

★ ★ ★

తీయని మాతృత్వపు అనుభవం అపురూపమవుతుంటే... తెలియని మధురాను భూతేదో నాలో ఆవిష్కరింపబడుతుంటే...

ఓ మంచు అల ఎగిసిపడినట్లు... ఓ వెన్నెల స్వప్నం చెదిరినట్లు... చప్పున మెలకువయింది !!

"నాకేమో నిద్ర రావట్లేదు...! నువ్వేమో హాయిగా పడుకున్నావా...?!"

అంటూ చిరుకోపం ప్రదర్శిస్తూ... నను అల్లరిగా తడుతూ చిలిపిగా మారాం చేస్తున్నట్లు... వెన్న ముద్ద కదలినట్టు... గర్భంలోంచి సుతిమెత్తని ప్రకంపనలు...

తుళ్ళిపడి నిద్రలేచాను !

రాత్రివేళది. సమయమెంతయ్యిందో తెలీదు.

ఇంతలో...

నిద్రలోనే నావైపు తిరిగిన శ్రీవారు తన కుడి చేయిని నా పొత్తికడుపు మీద పడేసి నన్ను మరింత దగ్గరగా హత్తుకున్నారు.

లోపలున్న శిశువుకి గాలి ఆడక ఉక్కిరిబిక్కిరై తిరిగి గొడవ పడ్తుందేమోనని... శ్రీవారు చేయిని సుతారంగా పొత్తికడుపు మీంచి తీసి కాస్త ఎడంగా జరిగాను.

కిటికీలోంచి పిల్ల తెమ్మెరలు వచ్చి తనువునంతా చల్లగా స్పృశిస్తుంటే నా మనసుకెంతో హాయిగా అన్పించింది.

కానీ, శిశువు లోపల ఇరుకిరుగ్గా ఎంతిబ్బంది పడుతోందో...?!

మరెంత చిరాకు పడుతోందో...?!

లేకపోతే సణుగుడులా ఆ కదలికలేంటి...!?

గర్భసంచీలోంచి త్వరగా బయటి ప్రపంచంలోకి కాలుమోపాలని, ఎంతిదిగా ఆరాటపడుతోందో ఆ అసహనపు కదలికలు తెలియపర్చడం లేవూ?!... పిచ్చి తల్లి !!

ఇన్నేళ్ళకి... నన్ను కనికరించి... తల్లిగా నన్ను ప్రమోట్‌చేసి... నన్నో మాతృమూర్తిగా లోకానికి పరిచయం చేస్తూ... కన్న తల్లి జన్మతరింప చేయడానికి ఉవ్విళ్ళూరుతున్నట్టుంది... చిట్టి తల్లి !!

ఉమ్మనీరు దాటి... బయట ఊపిరి పీల్చుకోవడానికి... సమయం రావద్దూ...?? నా ఊహకి నాకేనవ్వొచ్చింది.

శిశువుని వాత్సల్యపూరితంగా బుజ్జగిస్తున్నట్టు... ప్రేమగా అరచేత్తో పొత్తికడుపుని తడుముకున్నాను.

ఈ మాతృమూర్తి స్పర్శలోని ఆప్యాయతకి కాస్త ఊరట కలిగినట్లుంది. ఆందోళన చెదరి... అంతా ప్రశాంతమైపోయినట్లు... నిశ్శబ్దమైంది లోపల.

ఆ మాత్రపు ఆలంబనకే... అంతవరకూ అలజడి సృష్టించి... నన్నాటపట్టించిన గర్భస్థ శిశువు... అల్లరి ఆపి... బుద్ధిగా బజ్జున్నట్టుంది. కదలికలు సద్దుమణిగాయి.

తృప్తిగా ఫీలయ్యాను !

జీరోవాట్ బల్బ్ వెలుతురుని చిన్న బుచ్చుతూ పౌర్ణమి వెన్నెల గదిలోకి ప్రసరిస్తోంది కిటికీలోంచి.

కిటికీ అంచుగుండా బయటికి దృష్టిసారించాను.

నీలగిరి వృక్షాలు అలవోకగా కదుల్తూ కన్పించాయి.

చిరుగాలల తాకిడికి వృక్షాలు స్పందించి పాడుతున్న లాలిపాటకి, తలలూపుతున్న చిన్నారి చిగురుటాకులు రెపరెపలాడ్తున్నట్లున్నాయ్.

అప్రయత్నంగా నా మదిని ఆలోచనలు మింగేసాయ్...

★ ★ ★

పెళ్ళై...

దాదాపు పదేళ్ళవుతోంది...!!

ఎన్ని క్షణాలు నిర్లిప్తంగా రాలిపోయాయో... ఎన్ని నిమిషాలు నిరాసక్తంగా గడిచి పోయాయో... ఎన్ని రోజులు భారంగా దొర్లిపోయాయో...

...మూగవోయిన కాలానికి తెలుసు !

తల్లినయ్యే భాగ్యానికి నోచుకోని క్షణం వరకూ గొడ్రాలిననే పేరిడబడి-

ఎన్నెన్ని చీవాట్లు తిన్నానో... ఏ నరకం అనుభవించానో... మరెంత క్షోభకి గురయ్యానో...

...గుండెలోంచి ఇగిరిపోయిన కన్నీళ్ళకి తెలుసు !

నాపై నాకే విరక్తి కలిగేలా-

ప్రతి ఒక్కరి చూపుల్లోనూ ఏహ్యాభావం మెదిలి, అందరి ప్రవర్తనలోనూ నా పట్ల నిర్లక్ష్యధోరణి కదలాడ్తుంటే...

అత్తమామలు, ఆడపడుచులూ, చివరికి భర్త కూడా సూటిపోటి మాటల్తో సూదుల్లా పొడుస్తుంటే...

...హృదయం ముక్కలయ్యేది !!

పూలుపూసి సువాసనలు వెదజల్లి... నిలువ నీడనిచ్చి సేదదీర్చి... చల్లగా గాలినిచ్చి ఊరటగొల్పే చెట్టుకి... కాయలు కాసే అవకాశం కలుగకపోతే... అది...అది... నేల మీద నిలువకూడదా...?!!

ఇదే అర్థంకాని ప్రశ్న మనసుని చెదపురుగులా తొలిచేది...!

అన్ని వేళలా అత్తమామలకి సేవలుచేసి... ఆపద సమయాల్లో ఆడపడుచులకి అండగా నిలచి... సర్వవేళలా భర్తకి తోడుగా నిలిచి అర్థభాగస్వామ్యమై అన్నీ సమకూర్చి, సహకరించి... అనురాగ దీపమై ఇంట్లో కొలువుదీరిన ఇల్లాలికి... పిల్లలు కనే యోగం లేకపోతే... ఆమె... ఆమె... భార్యగా మనకూడదా...?!!

ఇదే వేదన ఆవేదనై అనుక్షణం నను వెంటాడి వెంటాడి వేధించేది...!

చివరికి... ఏ దేవత నా మొర ఆలకించిందో... ఏ దేవుడు నా గోడు విని నను కరుణించాడో... నా జీవితాన వెలుగురేఖలు ప్రసరించాయి. ఇది ఏనాటి పుణ్యమో ఈ

6057



నాటికి వరమై నా కడుపుని పండించింది.

నా సుదీర్ఘప్రార్థన ఫలించి... ఆశ చిగురించి... ఈ జన్మకి సార్థకత... ఈ రూపాన ప్రతిఫలించింది.

నా పూజాఫలం దక్కి, ఓ శుభోదయాన.

నేను... నె...ల...త...ప్పా...ను !!

తల్లిని కాబోతున్నాననే శుభవార్త నన్ను నిలువెల్లా పులకరింపచేసి, పూర్తిగా పరవశింపచేసింది.

ఆడదానిగా పుట్టడమే అదృష్టంగా తలిస్తే, అమ్మను కాబోవడం మాతృత్వపు మధురిమల్ని ఆస్వాదించబోవడం... అపురూపం కాక మరేంటి?!

ఆలోచనల్తో అంతరంగం సుడులు తిరుగుతున్నా... ఒకే ఒక్క క్షణం అలసటగా కనురెప్పల్ని అరమోడ్పుచేశాను.

తిరిగి భారంగా కళ్లు పూర్తిగా తెరచి తలెత్తి ఆ వెన్నెల వెలుగులో గోడమీద పెయింటింగ్‌ని పరికించి చూశాను ఆసక్తిగా.

అక్కడ-

ఫారెక్స్ బేబీల్లాంటి పాపాయిలిద్దరూ-

ఒకప్పుడు... నా ఉనికిని చూస్తేనే కల్ళు చిట్లించుకొని... మొహం తిప్పేసు కున్నట్లన్పించేది !

కానిప్పుడు... ఆనందాన్నంతా తమ బోసినవ్వుల్లో పులుముకొని సంతోష కెరటాలై కేరింతలు కొడుతూ... మాతో ఆడుకోవడానికి ముద్దులొలికే శిశువు రాబోతోందని ఉత్సాహంగా నా వంక చూస్తున్నట్లన్పిస్తోంది !

అప్పటికీ... ఇప్పటికీ... ఎంతా తేడా ??

తేడా ఆ పెయింటింగ్‌లోనా...! నా చూపుల్లోనా...!

లేక అదంతా వట్టి భ్రమా...! నా హృదయాంతరంగ చింతనా ప్రభావమా...!

ఏదైతేనేం !!?...

ఒకనాడు శిశిరానికి నేపథ్యంలా వెలవెలబోయిన ఈ బెడ్‌రూమ్... నేడు నవవసంతానికి వేదికలా వెలుగులు కురిపిస్తోంది !

ఈ గదిలోని అణువణువూ ఆమనిగీతమాలపిస్తున్నట్లుగా, ప్రతి వస్తువూ ఆనందోద్వేగాల్తో ఉరకలు వేస్తున్నట్లుగా అన్పిస్తోంది.

నా మనసూ అలాగే తన్మయత్వంలో వూగిపోతోంది.

కాస్త తలవంచి మురిపెంగా పొట్టకేసి చూసుకున్నాను. ఉబ్బెత్తుగా ఎంత ముద్దొస్తోందో...! తనివితీరా మరోమారు ఆప్యాయంగా పొట్టనిమురుకుంటుటే.. ఏదో తెలిని

పులకింత నన్నావహించింది.

మాతృత్వపు తలపు మనోహరమై నా ఎదని పరిమళింపచేస్తోంది.

ఈ మధుర భావనల్ని నా సొంతం చేసుకొని... ఈ అమృతక్షణాల్ని నేను పొదవిపట్టుకొని హత్తుకొని... ఆనంద ఘడియల్ని శాశ్వత పరచుకుందామనుకునే లోపునే... అవి చేజారిపోయాయి.

చిరు ఆశల దీపాన్ని నిరంకుశంగా ఊదేసిపోయాయి.

చిరునవ్వుల జడిని నిర్దయంగా తరిమేసి పోయాయి.

నేనిన్నిరోజులూ, ముద్దులొలికే ఏ పసిడినవ్వుల సవ్వడి కోసం కలవరించానో... ఏ మమకారపు అనుభూతి నా నరాల్ని స్వరపర్చడం కోసం పలవరించానో...

అవన్నీ హఠాత్తుగా అదృశ్యమైపోయే తరుణం ఆయత్తమవుతుంటే చేష్టలుడిగి పోయాను. చలనం లేకుండా ఉన్నాను.

దీనికంతటికీ కారణమేమంటే... నిన్న రాత్రి ఎనిమిది గంటల వేళప్పుడు మా వారు నన్ను వెంటపెట్టుకొని వెళ్ళి డాక్టర్‌తో జనరల్ చెకప్ చేయించారు. డాక్టర్ ఎప్పట్లా నార్మల్ చెకప్‌లు చేసి... కొత్తగా స్పెషల్ టెస్ట్‌లు చేసి, ఆరోగ్యానికేం ఢోకాలేదని మరోమారు సర్టిఫికెట్టిచ్చేసింది. మరికొన్ని మందులు ప్రిస్క్రైబ్ చేసింది.

ఇంటికి తిరిగి వచ్చాక అలసట అలుముకున్న శరీరానికి కాస్త రెస్ట్ అవసరమన్పించింది. బెడ్‌రూంలోకి వెళ్ళి మంచంమీద వాలిపోయాను బద్ధకంగా.

అతితొందర్లనోనే నిద్ర ఆవహిస్తోందనడానికి సూచనగా కనురెప్పలు మూతబడబోతుంటే... బయట హాల్‌లోంచి నెమ్మదిగా తల్లీకొడుకుల సంభాషణ వినిపించసాగింది. ముంచుకొస్తున్న నిద్ర బలవంతాన ఆగిపోయింది.

"ఏరా కాపుడూ! నీ పెళ్ళాన్ని డాక్టరమ్మకి చూపించావా...!" అడుగుతోంది మా అత్తగారు.

"చూపించానమ్మా !" సమాధానం చెబుతున్నారు ఆయన.

"ఆ పరీక్షలు గట్రా కూడా చేయించమన్నాను. చేయించావా ?!"

"......"

"మాట్లాడవేంరా కాపుడూ !... పుట్టబోయేది మగపిల్లాడా, ఆడకూతురా ముందుగానే తెలియడానికి అవేవో పరీక్షలు చేయిస్తున్నార్టగా ఈ మధ్య ! ఆ పరీక్షలు చేయించావా అని అడుగుతుంటే సమాధానమీయకుండా మూగలా నిలబడతావేంరా...?!" కాస్తగొంతు హెచ్చించింది.

"అబ్బా...! నీవు చెప్పినట్లే చేయించాన్లేవే ! పెద్దగా అరవకు !"

"ఏం చెప్పిందిరా డాక్టరమ్మ?!"

"ఏం చెబితే ఏమిటమ్మా ఇప్పుడు ?... పుట్టబోయేది ఎవరైనా తప్పదు కదమ్మా !!"

"తప్పదంటావేంట్రా?!... అంటే... అది కనబోయేది ఆడపిల్లనేనా !"

"ఎవరైతే ఏంటి ?... ఇన్నాళ్ళకి ఈ నట్టింట్లో పసిపాపకేరింతలు వినబడబోతున్నాయి. నేను తండ్రిని కాబోతున్నాను".

"చాల్చాల్లే సంబడం ! సిగ్గులేకపోతే సరి ! మరో ఆడపిల్ల ఈ ఇంట్లోకి కాలుమోప డానికి... చస్తేవొప్పుకోను !!"

ఉలిక్కిపడ్డాను ! మగతనిద్ర మత్తు వదిలింది.

"నలుగురు ఆడపిల్లల తర్వాత మగ నలుసువి నువ్వుపుట్టావురా ! మీ అందరి నోళ్ళలోకి నాలుగువేళ్ళూ పోవడానికి... మీరడిగింది అమర్చడానికి... కోరింది తెచ్చిపెట్టడానికి... మీ నాన్న నేనూ కలిసి ఎన్ని ఊడిగాలుచేశామో ? ఎంత నరకయాతన పడ్డామో ? నీకు తెలీదు. అదంతా పక్కన పెట్టు.

దీనికితోడు నీ అక్కలందరికీ ఒకరో, ఇద్దరో ముగ్గురో... అందరూ ఆడ సంతానమే! తిరిగి నీ కడుపున కూడా ఆడపిల్లేనంటే నేను ససేమిరా వొప్పుకోను. ఈ ఇంట్లోకి వస్తే మగపిల్లాడే రావాలి. కంటే నీ పెళ్ళాం బాబునే కనాలి." హుకుం జారీచేసిందామె.

"అబ్బాయినే కని తీరాలంటే అది మన చేతుల్లో లేదు కదమ్మా !"

"నిజమే కావచ్చు. కానీ ఆడపిల్లను భూమ్మీదకు రాకుండా చేయడం మాత్రం మన చేతుల్లో పనేగా..."

అది వింటున్న నేను 'స్టన్' అయిపోయాను. పిడుగు నడినెత్తిమీద పడ్డట్టు... ఊపిరి స్తంభించింది.

ఆవిడ ఆలోచనంతా...

భ్రూ...ణ...హ...త్య... గురించి !

అర్థమైన మరుక్షణం వొళ్ళు జలదరించింది.

బద్దలైన అగ్నిపర్వత శిఖరపు అంచులోంచి పొంగిన లావాను నిలువెల్లా కమ్మేస్తున్న అనుభూతి.

ఆయనగారేం సమాధానం చెబుతారోనని భయంభయంగా చెవులురిక్కించాను. ఏం మాట్లాడడం లేదు.

ఆ కొడుకు తల్లిమాట తీసేయనూలేడు... అలా అని ఎదిరించనూలేడు... పూర్తిగా తల్లిచాటు బిడ్డ ! చెప్పేది వినేరకం... చేయమన్నది తలూపుతూ చేసేరకం...!

"గర్భంలోని పిండం గర్భంలోనే పోయేటట్లు నేను చూసుకుంటాను..." అంటోందామె.

ఆమె పథకం విని నిలువెల్లా వణికిపోయాను !

ఒళ్ళంతా చెమటల్లు పట్టేస్తుంటే, ఆర్తిగా పొట్టతడుము కున్నాను. దుఃఖం

పొంగుకొచ్చింది.

నా మాంసపుముద్ద ఆడపిల్లై కళ్ళుతెరవకుండా ఉండేందుకు వాళ్ళు తలపెట్టిన ఘోర అకృత్యం చెవులారా విన్నా... నా కనురెప్పలు తడిసి కన్నీటి ముద్దలవలేదు.

గుండె తల్లిడిల్లలేదు...! గుండె దిటువు చేసుకున్నాను !!

మనసు మూగవోలేదు...! మమకారం పెల్లుబికింది !!

హృదయం గడ్డకట్టలేదు...! వాత్సల్యమై పొంగింది !!

ఎద శిథిలమవలేదు...! ధైర్యం చిగురించింది !!

వాళ్ళ అమానుషపు ఆలోచన నాకు కర్తవ్యాన్ని ప్రబోధించింది. ఓ సరికొత్త నిర్ణయానికి నాంది పలికించింది.

ఆడది... అక్కగా, చెల్లిగా, కూతురుగా, అత్తగా, కోడలిగా, భార్యగా ఓర్పుతో అన్నీ సహిస్తుందేమో కానీ... ఓ అమ్మగా కన్నతల్లిగా గర్భశోకాన్ని భరించలేదు. ఆ వియోగానికి తట్టుకోలేదు.

అందుకే, అవసరమైతే ప్రతిఘటిస్తుందని లోకానికి ఎలుగెత్తి చాటడానికి నేను నిలువెత్తు ఉదాహరణగా నిలవబోతున్నాను !

ఓ కృతనిశ్చయానికి వచ్చిన దానిలా-

శ్రీవారికి నిద్రాభంగంమవకుండా ఆయన్ని సుతిమెత్తగా పక్కకు కదిపి, నెమ్మదిగా పక్కమీద నుండి లేచాను.

ఎలాంటి అలికిడికాకుండా జాగ్రత్తపడుతూనే అడుగులో అడుగేసుకుంటూ నా పని నేను నిశ్శబ్దంగా చేసుకుపోయాను.

సూట్‌కేస్ తెరచి ఓ రెండు జతల చీరలు, మిగతా బట్టలు, డిగ్రీ సర్టిఫికేట్స్... వగైరాలు సర్దాను. మంగళసూత్రం మినహా నావొంటిమీదున్న నగలన్నీ వొలిచి డ్రెస్సింగ్ టేబుల్లో పడేశాను.

వెన్నెల వెలుతురులోనే... ఆ కాస్త జీరోఓల్ట్ కాంతిలోనే... పనులన్నీ పూర్తి చేసుకున్నాను.

శ్రీవారు సన్నగా గురకతో గాఢనిద్రలో మునిగిఉన్నారు.

చివరిసారిగా ఆయన పాదాలకోసారి మనసారా నమస్కరించాను. ఎంతయినా నాకీ మాతృత్వాన్ని ప్రసాదించిన భర్తకదా !

విచార వదనాల్తో మొహం ముడుచుకొని నావంక బేలగా చూస్తున్న గోడమీది పెయింటింగ్‌లోని పిల్లలకి కన్నీటి 'టాటా' చెబుతూ బయటకు నడిచాను. బెడ్‌రూం తలుపులు తీసుకొని... హాల్‌దాటి... ఇవతలికి వచ్చేసాను.

గుమ్మందాటి వీధిలోకి చేరాక, నాకిన్ని రోజులు ఆశ్రయం కల్పించిన ఆ గృహానికేసి ఓసారి కృతజ్ఞతా పూర్వకంగా చూసాను.

టపటపా రాలిపడ్తోన్న అశ్రుధారలు మూగగా వీడ్కోలు పలికాయి.

ఓ చేత్తో కొంగుని నోట్లో కుక్కుకొని.. మరో చెత్తో సూట్‌కేస్ పట్టుకొని ఉబ్బెత్తు పొట్టతో ఆయాసపడుతూనే... భారంగా అడుగులు కదిపానక్కడినుండి.

నాకాళ్ళు దారివెంట కదులుతున్నాయి. చీకట్లో అలా ఒంటరిగా నడుస్తూనే ఉన్నాను.

నా పయనమెటో నాకే తెలీదు !

శ్రీవారి తలగడ కింద ఉంచి వచ్చిన ఉత్తరంలోని అక్షరాలు నా మనసుపొరల్లోంచి మరోసారి తొంగిచూసాయ్...

ప్రియమైన శ్రీవారికి,

కార్యేషుదాసినై మీకు సేవలు చేశాను. కరణేషు మంత్రినై మీ ఆలోచనల్ని పంచుకున్నాను. శయనేషు రంభనై మీకు అన్నిరకాల అనుభూతుల రుచులందించాను. భోజ్యేషు మాతగా వేళకి మీ ఆకలిదప్పుల్ని తీర్చాను.

ఏ కనుగుడ్డుకు దెబ్బతగిలితేనేం... కంటికేగా బాధ కలిగేది! ఏ పసిగుడ్డు ప్రాణం తీస్తేనేం... కడుపుకోతేగా మిగిలేది !!

అందుకే వెళ్ళిపోతున్నాను. ఆచూకీ తెలియనంతదూరంగా వెళ్ళిపోతున్నాను. పాపకి జన్మనివ్వాలని ! ఆడపిల్లయితేనేం, స్వేచ్ఛగా కళ్ళుతెరిచే హక్కు నివ్వాలని!! అమ్మనై కరిగిపోతూ ఆ పసికందు అలనాపాలనా చూడాలని !!!

కంగారు పడకండి. నా కొరకు వెతక్కండి.

మాతృత్వపు మధురిమలకై ఆర్రులుచాస్తూ... మీరు గీచిన గీత దాటి ఈ స్వయం నిర్ణయం తీసుకున్నందుకు... నన్ను మన్నించండి.

పండంటి పాపని కనమని మనసారా దీవించండి.

క్షేమంగా పాపని కని...

మీ పాదాల చెంతకు మరలి వచ్చేస్తాను.

---మీ పాదదాసి.

నా కనుకొనల్లోంచి రాలిపడ్తున్న అశ్రుకణాలు ఆకాశగర్భంలో చేరి నక్షత్రాలై మెరుస్తుంటే తూరుపుదిక్కుకి సాగిపోయాను.

తలెత్తి చూసాను.

ఓ నీలిమేఘం నావైపువంగి... నీతోడు నేనువ్నానంటూ స్నేహహస్తం చాస్తున్నట్లన్పించింది.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాను.